క్లుప్తంగా

అనారోగ్యం తాళలేక యువకుడి బలవన్మరణం

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యాన్ని తట్టుకోలేక హుకుంపేట డీబ్లాక్ గౌతమీనగర్‌కు చెందిన ఆకుల శ్రీనివాసనాయుడు(21) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు, శ్రీనివాసనాయుడు డిప్లమో సెకండియర్ డిస్‌కంటిన్యూ చేశాడు. మ్యారేజ్ ఈవెంట్స్ చేస్తున్నాడు. అతని తల్లి కువైట్‌లో పని కోసం వెళ్లడంతో, తాతయ్య, అమ్మమ్మ వద్ద శ్రీనివాసనాయుడు, అతడి అన్నయ్య ప్రవీణ్‌పాల్ ఉంటున్నారు. ఇటీవల శ్రీనివాసనాయుడుకు జ్వరం రావడంతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు టైఫాయిడ్‌గా నిర్ధారించారు. సోమవారం అన్నయ్య డ్యూటీకి వెళ్లగా, తాతయ్య, అమ్మమ్మ హెల్త్ చెకప్ కోసం హాస్పిటల్‌కు వెళ్లారు. అనంతరం కడుపునొప్పి వస్తుందని శ్రీనివాసనాయుడు తన మేనత్తకు చెప్పాడు. ఆమె ఇంటికి వెళ్లి మజ్జిగ కలిపి తెచ్చేలోగా ఇంటి తలుపులు వేసి గడియపెట్టుకున్నాడు. ఎంతకూ తలుపులు తీయకపోవడంతో ఆమె కిటికీలోంచి చూడగా, గదిలో ఫ్యాన్‌కు చీర తో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో అతడిని తొలుత ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రవీణ్‌పాల్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలాలి కుటుంబానికి చందన పరామర్శ



షేక్ మౌలాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చందన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత షేక్ మౌలాలి, ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల షేక్ మౌలాలి మేనల్లుడు ఆమీరుద్దీన్ గుండెపోటుతో మరణించారు. దీంతో అమీరుద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయాన్ని నాగేశ్వర్ అందజేశారు. ఆయన వెంట ఎంఎం ఆలీ, చెరుకూరి సత్తిబాబు, సయ్యద్ పింటూ, దస్తగిరి, ముజ్జు తదితరులు ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

వీఎఫ్ఐ చైర్మన్ జక్కర్



జక్కర్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: వాలీబాల్ క్రీడలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ అవార్డు గ్రహీత, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ రామావతార్ జక్కర్ కోరారు. సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి అనేక మంది అంతర్జాతీయ క్రీడాకారులు, కోచ్‌లు ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మంచి క్రీడాకారులను గుర్తించి, వారిని రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి జిల్లా సంఘం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ కుంచే యశ్వంత్, ప్రెసిడెంట్ రవిరాజు, కార్యవర్గ సభ్యులు సత్కరించారు.

సారా బట్టీలపై విస్తృత దాడులు

సారా స్వాధీనం, ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆధ్వర్యంలో సోమవారం సౌత్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. శాటిలైట్‌సిటీ, నామవరం గ్రామాల్లో సారా బట్టీలపై దాడులు చేసి, 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారులైన కోటా బూరయ్య, నిచ్చెనకోళ్ల శ్రీను, కోమలి కృష్ణను అరెస్టు చేశారు. ఈఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, బొమ్మూరు పోలీసులు పాల్గొన్నట్టు సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బిరెడ్డి తెలిపారు.

హత్య ఘటనపై బాలేపల్లి దిగ్భ్రాంతి

రాజమహేంద్రవరం రూరల్: కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ఘటనపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు బాలేపల్లి మురళీధర్ ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంతపర విభేదాలు తప్ప విద్వేషాలు ఉండరాదన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గోదావరి ఒడి.. అందెల సవ్వడి

- సాంస్కృతిక రాజధాని నాట్యానికి ప్రసిద్ధి
- వేల మంది కళాకారులకు పుట్టినిల్లు
- అనేక రికార్డులు రాజమహేంద్రికి సొంతం
- నేడు అంతర్జాతీయ నాట్య దినోత్సవం



నృత్యాభినయం చేస్తున్న కళాకారులు



నృత్యాభినయం చేస్తున్న లక్ష్మీదీపిక

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రపంచవ్యాప్తంగా నాట్య కళ ప్రసిద్ధి చెందింది. రెండు వేల ఏళ్ల క్రితం ఈ నాట్యం భరత ముని ద్వారా శాస్త్రీయ రూపాన్ని సంతరించుకుంది. పురాణాల్లో నాట్య ప్రస్తావన ఉంది. శివుడిని నటరాజ రూపంలో ఆరాధిస్తారు. అజ్ఞాత వాసంలో బృహన్నలగా మారిన అర్జునుడు నాట్యాచారుడిగా రాణించారని తెలుస్తోంది. కేంద్ర సంగీత నాటక అకాడమీ దేశంలోని ఎనిమిది రకాల నాట్య శైలులను శాస్త్రీయ నృత్యాలుగా గుర్తించింది. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, కథక్, కథకళి, మోహినియాట్టం, సాత్రియ, మణిపూరి వంటివి ప్రసిద్ధి చెందాయి. ఫ్రాన్స్‌లో ప్రసిద్ధి బెలెట్ సృష్టికర్త జీన్ జార్జిస్ నోవెర్రె పుట్టిన రోజున ప్రపంచ నాట్య దినోత్సవంగా 1982 ప్రకటించారు. అప్పటి నుంచి ఏప్రిల్ 29న ప్రపంచ నాట్య దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

నాట్యానికి జీవం

కూచిపూడి నృత్యాన్ని నేటి తరం తెలుసుకోవాలనే సంకల్పంతో మహా యజ్ఞానికి శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం నిర్వాహకుడు జీబీ నారాయణ ఆగస్టు 11న రాజమహేంద్రవరంలో శ్రీకారం చుట్టారు. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి, తద్వారా కూచిపూడికి పూర్వ వైభవం తేవడానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 22 రాష్ట్రాల్లోని ప్రసిద్ధ దేవాలయాల్లో నిర్విరామంగా 63 రోజుల పాటు తన శిష్యబృందంతో కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. 2003 ఆగస్టు 11న ఇందుకు రాజమహేంద్రవరం వేదికైంది. అయినవిల్లి, మహానంది, శ్రీశైలం, విజయవాడ, అన్నవరం, సింహాచలం, బాసర, వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రకాళీ టెంపుల్, భద్రాచలం, పూరిజగన్నాథ్, కాళీఘాట్, సూర్యనారాయణ దేవాలయం, శక్తిపీఠం, వారణాసి, కేదార్‌నాథ్, జ్వాలాదేవీ, వైష్ణవి దేవాలయం, అమృత్‌సర్, కార్తికేయ టెంపుల్, బృందావనం, ఉదయపూర్, పశుపతినాథ్ ఆలయం, షిర్డీ, మంత్రాలయం, తిరువనంతపురం, కన్యాకుమారి, తిరుపతి వంటి పుణ్య క్షేత్రాల్లో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. 12 గంటల 23 నిమిషాల 1 సెకను పాటు హనుమాన్ చాలీసాను 126 మందితో నృత్యం చేసినందుకు గిన్నిస్‌బుక్, వండర్ బుక్, జీనియస్, భారత తెలుగు అకాడమీ, గోల్డెన్ స్టార్ వంటి రికార్డ్సని శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం సొంతం చేసుకుంది.

శాస్త్రీయ నృత్యానికి కొరవడిన ఆదరణ



పాశ్చాత్య సంగీతం, నృత్యం వైపు నేటి తరం ఎక్కువగా ఆసక్తి చూపుతుంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పేరొస్తుందనే ఆశతో పాశ్చాత్య నృత్యం వైపు పంపుతున్నారు. టీవీ షోల్లో అసభ్యకరమైన విన్యాసాలతో, పొట్టి డ్రెస్సులతో చేసేది నాట్యమని భ్రమిస్తున్నారు. మన ప్రాచీన కళైన సంప్రదాయ నృత్యం వైపు ప్రపంచం చూస్తోంది. మనం మాత్రం ఆధునిక పోకడలు అంటూ తలాతోక లేని డ్యాన్స్ వైపు పరుగులు పెడుతున్నాం.

– డాక్టర్ జీబీ నారాయణ, వ్యవస్థాపకులు, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం

ప్రముఖ నాట్యాచార్యులకు సత్కారం



ప్రపంచ నాట్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రముఖ నాట్యాచార్యులకు సత్కారం చేస్తున్నాం. మన నాట్యం.. మన సంస్కృతీ సంప్రదాయాలకు మూలం. శ్రీవిజయ శంకర సంగీత, నృత్య ప్రభుత్వ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు నాట్యం, సంగీతం నేర్చుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారు.

– డాక్టర్ ఎం.నాగలక్ష్మి, ప్రిన్సిపాల్, శ్రీవిజయశంకర సంగీత, నృత్య పాఠశాల

ప్రజా రవాణా ఉద్యోగుల ఆందోళన



నిరాహార దీక్షలో ఉన్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ)లో విధులు నిర్వహించే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ప్రెసిడెంట్ వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరం ఏపీపీటీడీ కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019 అన్ని డిపోల్లో వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపివేయాలని, గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. పాత వైద్య విధానాన్ని కొనసాగించేలా చర్యలు చేపట్టాలన్నారు. జీవో 114లో పొందుపర్చిన నైట్ అవుట్ అలవెన్సును రూ.150 నుంచి రూ.400కు పెంచాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించి, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ తన నిజాయితీ నిరూపించుకోవాలి

మాజీ ఎంపీ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యవహారంలో భారీ కుంభకోణం జరుగుతోందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వంలో జిల్లా కేంద్రంలో ఇసుక తవ్వకాలకు డ్రెడ్జింగ్ మెషీన్లు పెట్టి గోదావరికి గర్భశోకాన్ని కలిగిస్తున్నారన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వైఎస్సార్ సీపీలో ఉండగా ఇసుకపై యుద్ధం చేశారన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు సిటీ ఈవీఎం ఎమ్మెల్యే భారీగా ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా సాగుతున్న ఈ ఇసుక మాఫియాను ఇప్పుడు అడ్డుకుని, ఆదిరెడ్డి అప్పారావు తన నిజాయితీ నిరూపించుకోవాలని భరత్‌రామ్ కోరారు. ఈవీఎం ఎమ్మెల్యే పాలనలో గోదావరి ఇసుక రేవులు దారుణంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. గతంలో కూడా ఇదే విషయాన్ని సోషల్ మీడియాలో ప్రస్తావిస్తే కమ్యునల్ వయొలెన్స్ కింద తనపై కేసు పెట్టారన్నారు. దీనిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తానన్నారు. మాజీ ఎంపీగా తనకే వాక్ స్వాతంత్ర్యం లేకపోతే, సాధారణ ప్రజల సంగతేమిటని ప్రశ్నించారు. ఇంకో పది కేసులు పెట్టి సెంట్రల్ జైలుకు పంపినా సిద్ధమేనన్నారు. గోదావరి కాలుష్యంతో ఉందని, శుభ్రం చేయాలని అడిగే తప్పా అని నిలదీశారు. ప్రజాపక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. ఇసుక, మద్యం మాఫియా సాగిస్తూ, భూదందా చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

ఉగ్ర దాడికి నిరసనగా శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జమ్ము–కశ్మీర్‌లోని పహల్‌గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదుల జరిపిన దాడిని ఖండిస్తూ రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కోళ్ల వీరాస్వామి కల్యాణ మండపం వద్ద సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల బాబు, మాజీ కార్పొరేటర్ కొమ్మా శ్రీనివాస్, గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవిందు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతి పౌరుడు ఈ దాడిని ఖండించాలన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే

సీటీఆర్ఐ: ముస్లింలకు హజ్ పవిత్ర యాత్ర అని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. హజ్ యాత్రకు ఎంపికైన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల హజ్ యాత్రికులకు గోదావరి హజ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూనగర్‌లోని బిలాల్ షాదీఖానాలో సోమవారం వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇక్కడి నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. తెలంగాణ హజ్ కమిటీతో సమన్వయం చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. వసతి కేంద్రాలు, భోజన సౌకర్యం, తాగునీరు, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స తదితర వాటిపై తెలుగు రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. ఏపీ నుంచి 1,630 మంది హజ్ యాత్రకు బయలుదేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్లా, గోదావరి హజ్ సొసైటీ అధ్యక్షులు హబీబ్ బేగ్, సభ్యులు పాల్గొన్నారు.

మెదడుకు మేత

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం
- కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాల నిర్వహణ
- పుస్తక పఠనం, సమీక్షలు, భావవ్యక్తీకరణ.. మరెన్నో అంశాలు
- ముగింపు రోజున సర్టిఫికెట్ల అందజేత



ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో తయారు చేసిన క్రాఫ్టులతో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయాల్లో సోమవారం నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు జూన్ ఆరు వరకు కొనసాగుతాయి. ఈ మేరకు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో రీజనల్ లైబ్రరీ గౌతమి గ్రంథాలయంతో పాటు, జిల్లాగ్రంథాలయ సంస్థ పరిధిలో ఆరు గ్రంథాలయాలు ఉన్నాయి. రూరల్ నియోజకవర్గపరిధిలో కడియం, ఆల్కాట్‌తోట గ్రంథాలయాలు, సిటీ నియోజకవర్గంలో దానవాయిపేటలో మహిళా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయం, ఇన్నీసుపేట, సీతంపేట గ్రంథాలయాలు ఉన్నాయి.

40 రోజుల ప్రణాళిక

వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం నుంచి జూన్ ఆరో తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది. శిబిరాల్లో విద్యార్థులతో కథలు, క్విజ్, జనరల్ నాలెడ్జ్, చిత్రలేఖనం, 2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్–స్వచ్ఛాంధ్రప్రదేశ్ వంటి విజ్ఞానదాయక కార్యక్రమాలతో పాటు, కథలు, గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, క్రాఫ్ట్స్, డ్యాన్స్, ప్రముఖుల ప్రసంగాలు, డ్రామాలు, బొమ్మల తయారీ తదితర అంశాలపై కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి వారం ముగింపు వ్యక్తీకరణ సెషన్లు, వారి పఠన అనుభవాలు పంచుకోవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, రాయడం వంటివి నిర్వహిస్తారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు, విద్యావేత్తలు న్యాయ నిర్ణేతలుగా ఆహ్వానిస్తారు. వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై అనుభవాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించడం, శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రముఖులు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. సమ్మర్ క్యాంప్‌కి సంబంధించి 10 నుంచి 15 ఏళ్లున్న ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులను అర్హులు. తల్లిదండ్రుల అంగీకారంతో తగు జాగ్రత్తలు పాటిస్తూ పాఠశాల విద్యార్థులను అనుమతిస్తారు.

కార్యక్రమ లక్ష్యాలు

- పిల్లలు సెలవులను సక్రమంగా వినియోగించుకోవడం
- పిల్లల్లో చదివే అలవాటు పెంపొందించడం
- పాఠశాల వయస్సు పిల్లలను గ్రంథాలయాలకు వచ్చేలా అలవాటు చేయడం

ఇన్నీసుపేటలో ప్రారంభం

రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభోత్సవాన్ని కోళ్ల వీరాస్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు(బాబు), మాజీ కార్పొరేటర్ కొమ్మా శ్రీనివాస్, గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవింద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. లైఫ్ స్కిల్స్, హ్యాండ్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, లలిత సంగీతం తరగతులు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ మాజీ కార్యదర్శి మారిసెట్టి సత్యనారాయణను ట్రస్టు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, మతల మాధవి, చలుమూరి సత్యనారాయణ, లైబ్రేరియన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరాన్ని సర్పంచ్ మోసిగంటి సత్యవతి ప్రారంభించారు. 40 రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ఆటలు, పాటలు, డ్రాయింగ్, నృత్యం, కథలు, పప్పెట్రీ, చేతిరాత తదితర అంశాలపై పిల్లలకు వివరిస్తారన్నారు. ప్రముఖ కవి చిలుకూరి శ్రీనివాసరావు, దాతలు ఉప్పులూరి హనుమంతరావు, అడపా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయిని గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంతో మేలు

జూన్ ఆరో తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయి. పిల్లలు ఈ వేసవి సెలవుల్లో మంచి అలవాట్లు పెంపొందించుకునేందుకు సదవకాశం. ఇప్పటి నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం నేర్పితే, భవిష్యత్తులో ఎంతో బాగుంటుంది. ముఖ్యంగా యువత చెడుమార్గాలకు వెళ్లకుండా ఈ వేసవి శిబిరాలు ఉపయుక్తంగా ఉంటాయి.

– అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి, లైబ్రేరియన్, మహిళా గ్రంథాలయం, దానవాయిపేట

నిరతాన్నదాత డొక్కా సీతమ్మకు నివాళి



డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రుల అన్నపూర్ణ, నిరతాన్నదానానికి ప్రతీకగా నిలిచిన డొక్కా సీతమ్మ వర్ధంతిని స్వర్ణాంధ్రలోని వృద్ధాశ్రమంలో నిర్వహించడం ఆనందంగా ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ పాతంశెట్టి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా కొలిచే డొక్కా సీతమ్మ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతోందన్నారు. అవసరార్థుల కోసం అన్నదానం చేయడం స్వర్ణాంధ్ర 27 ఏళ్లుగా కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు నయనాల కృష్ణారావు, పెయింటింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు జి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరించిన మేనేజర్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన వారికి డిపో మేనేజర్ షేక్ షబ్నం నగదు బహుమతులతో సత్కరించారు. సోమవారం రాజమహేంద్రవరం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబర్చిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికి ప్రశంసాపత్రాలతో పాటు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఏపీ రావు, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ నాగలక్ష్మి, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మెడికల్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద సంఘ అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ, సెక్యూరిటీ వ్యవస్థలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోందన్నారు. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకుని వీరితో 10 నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి రూ.24 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే డేకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ రానున్నారన్నారు. సమావేశంలో నాయకులు మోహన్, కుమార్, నాగేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమత్తుల నిమిత్తం మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శ్యామ్యూల్ సోమవారం తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, గోకవరం బస్టాండ్, కోర్టు ప్రాంతం, కోర్లమ్మపేట, దేవీచౌక్, లక్ష్మీవారపు పేట, ఆర్యాపురం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు పేపరు మిల్లు క్వార్టర్స్, ఆనంద్‌నగర్, వెంకటరాయపురం, రామదాసుపేట, శానిటోరియం రోడ్, రామకృష్ణాపురం, క్వారీ రోడ్, ఆర్‌అండ్‌బీ వాంబే ఇళ్లు, రాజీవ్‌గాంధీ నగర్, దుర్గానగర్, మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్, ఊటలంక, లూథర్‌గిరి, ఐటీ కాలేజీ, శ్రీరామ్‌నగర్, పేపర్‌మిల్లు సాయిబాబా గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

సంజీవ్‌నగర్‌లో చోరీ

కంబాలచెరువు: నగరంలోని సీటీఆర్ఐ సంజీవ్‌నగర్‌లో ఓ ఇంటిలో నగదు, బంగారు నగల అపహరణపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. బుడ్డిత మణికుమారి విజయలలిత ఈ నెల 2వ తేదీన ఊరు వెళ్లారు. తిరిగి 28న ఉదయం వచ్చారు. ఇంట్లో బీరువా తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. రూ.1.97 లక్షల నగదు, కొంత బంగారం కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్సైపై దౌర్జన్యం

విధి నిర్వహణలో ఉన్న ఎస్సైపై ఓ వ్యక్తి దౌర్జన్యం చేసిన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న అప్పలరాజు ఈ నెల 27న రాత్రి విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల వైపు వెళ్లారు. అక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తూ వ్యక్తి కనిపించాడు. అతడిని వారించడంతో ఎస్సైపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.